నమస్తే తెలంగాణ
మెదక్
13 | హైదరాబాద్, బుధవారం 17 జనవరి 2024 | MEDAK

ఉపకాల్వలను వెంటనే పూర్తి చేయాలి

మల్లన్నసాగర్ ద్వారా లక్షా 30 వేల ఎకరాలు సస్యశ్యామలం

దుబ్బాక నియోజకవర్గం రైతులను ఆదుకోవాలి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 16: నియోజకవర్గంలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు కింద నిర్మిస్తున్న ఉపకాల్వల పనులను వేగవంతం చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు. మంగళవారం సెక్రటేరియట్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించిన సమస్యలపై విన్నవించి వినతిపత్రం సమర్పించారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు ఫోన్‌లో తెలిపారు. కాళేశ్వరం, రంగనాయక సాగర్ నుంచి దుబ్బాక నియోజకవర్గం రైతులకు సాగునీరందించేందుకు కాల్వల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. రామాయంపేట, చేగుంట, దుబ్బాక మండలాల్లో పలుచోట్ల పనులు నిలిచిపోయాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. వారం రోజుల క్రితం సిద్దిపేట కలెక్టరేట్‌లో నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులతో కాల్వల నిర్మాణాలపై నిర్వహించిన సమీక్షా సమావేశం వివరాలను మంత్రికి వివరించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మల్లన్నసాగర్ ద్వారా దుబ్బాక నియోజకవర్గంలో సుమారు లక్షా 30 వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు ప్రధాన కాల్వల నుంచి ఉపకాల్వలు నిర్మించాల్సి ఉందని, పెండింగ్‌లో ఉన్న నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. చేగుంట, దుబ్బాక మండలాల్లో పనులు నిలిచిపోయాయని, మరికొన్ని చోట్ల భూ సమస్యలు, ఇతర వివాదాలు ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మల్లన్నసాగర్‌తో అన్ని గ్రామాలకు సాగునీరు సరఫరా చేసి, రైతులను ఆదుకోవాలని మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగు నీరందించి, ఆకుపచ్చ నియోజకవర్గంగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా..: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, జనవరి 16 : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన పారిశ్రామిక వేత్త, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు అన్నారెడ్డి గారి సుభాష్‌రెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో కలిసి ఎన్నికల్లో తన విజయానికి కృషి చేసినందుకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తాను ఆపదలో ఉన్నా నాయకులు, ప్రజలు ఆశీర్వదించి గెలిపించారని, వారందరికీ ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. పార్టీలకతీతంగా గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. బీఆర్ఎస్ అధికారంలో లేకున్నా, ప్రజల పక్షాన ఉంటామని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు మహ్మద్ షాదుల్లా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి, ఎనగుర్తి మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, అంజల్ ప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అన్నరెడ్డిగారి సుభాష్‌రెడ్డి ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలుపుతున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

అధికారులతో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాజర్షి షా

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

● మెదక్ కలెక్టర్ రాజర్షి షా ● డీఎంఎఫ్‌టీ పనులపై సమీక్షా సమావేశం

మెదక్, జనవరి 16 (నమస్తే తెలంగాణ): డీఎంఎఫ్‌టీ (డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ ట్రస్ట్)లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మెదక్ కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, డీఎంఎఫ్‌టీ మెంబర్ సెక్రటరీ రాజర్షి షా మాట్లాడుతూ డీఎంఎఫ్‌టీ మెదక్ జిల్లాలో పనుల వివరాలు, పూర్తి చేయాలనుకున్నవి, కొనసాగుతున్నవి, ఇప్పటి వరకు మొదలు కాని వాటి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో డీఎంఎఫ్‌టీలో మొత్తం 181 పనులకు రూ.26,23,64,000 లక్షల విలువ గల పనుల వివరాలను అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. వీటిలో 102 పనులు పూర్తి చేశామన్నారు. దీంతో, పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్డీవో శ్రీనివాస్, జడ్పీ సీఈవో శైలేశ్, సీపీవో కృష్ణయ్య, పీఆర్ ఈఈ నర్సింహులు, ఆర్‌అండ్‌బీ అధికారి సర్దార్ సింగ్, ఈడబ్ల్యూఐడీసీ ఆన్సర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

10లో.. ప్రథమ స్థానం రావాలి

సిద్దిపేట నియోజకవర్గంలో 100శాతం ఫలితాలు సాధించాలి

ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

పదో తరగతి ఫలితాలపై విద్యాధికారులు, ఉపాధ్యాయులతో టెలీకాన్ఫరెన్స్

సిద్దిపేట, జనవరి 16: పది ఫలితాల్లో సిద్దిపేట నియోజకవర్గం ప్రథమ స్థానంలో నిలిచేలా కలిసికట్టుగా పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నియోజకవర్గం విద్యాధికారులు, ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రధానోపాధ్యాయులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో గత స్ఫూర్తి కొనసాగించాలని, 100 శాతం ఫలితాలు వచ్చేలా సమిష్టి కృషి చేయాలని సూచించారు. సిద్దిపేటకు ఉన్న ప్రతిష్ఠ, గౌరవాన్ని కొనసాగించాలన్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తయితే ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లలు ఎక్కువగా ఉంటారని, వారిలో ఆత్మవిశ్వాసం నింపాలన్నారు. ఫలితాలపై ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఇంటి వద్ద ఫోన్లు వాడకుండా, టీవీలు చూడకుండా ఉండేలా చెప్పాలని, తల్లితండ్రులతో మీటింగ్ ఏర్పాటు చేసి పిల్లల చదువుకు పదో తరగతి తొలిమెట్టు అని, ఈ రెండు నెలలు చదువుపై దృష్టి సారించేలా తల్లిదండ్రుల్లో ఆత్మవిశ్వాసం నింపాలని, విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించాలని సూచించారు. విద్యార్థులకు సాయంత్రం వేళలో స్నాక్స్ అందించాలని, అందుకు పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. ప్రతి 10 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు ఉండేలా కేర్ టీచర్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. కేర్ టీచర్స్‌తో తాను 15 రోజులకొక సారి మాట్లాడుతానన్నారు. ఇలా పక్కా ప్రణాళిక చేసుకుని, గత స్ఫూర్తితో ముందుకెళ్దామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ నోడల్ అధికారి రామస్వామి, ఎంఈవోలు శ్రీనివాస్‌రెడ్డి, యాదవరెడ్డి, దేశిరెడ్డి ఉన్నారు.



జాతీయ స్థాయి పోటీలకు హిషాంత్

గజ్వేల్ అర్బన్, జనవరి16: బీహార్ రాజధాని పాట్నాలో జరుగుతున్న 67వ జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీలకు గజ్వేల్ పట్టణానికి చెందిన బాకి హిషాంత్ ప్రేమ్‌చరణ్ ఎంపికైనట్లు సిద్దిపేట జిల్లా కార్యదర్శి, అండర్-17 కోచ్ రామేశ్వర్‌రెడ్డి తెలిపారు. హిషాంత్ ప్రేమ్‌చరణ్ డిసెంబర్‌లో గజ్వేల్‌లో జరిగిన క్రికెట్ టోర్నీ లో 5 మ్యాచ్‌ల్లో 10 వికెట్లు తీయడంతో పాటు 2 ఆఫ్ సెంచరీలు చేశాడు. హిషాంత్ ప్రతిభను ప్రోత్సహిస్తూ రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ జాతీయ స్థాయి అండర్-17 స్కూల్ గేమ్స్ క్రికెట్ టోర్నీ రాష్ట్ర జట్టుకు ఎంపిక చేసింది. హిషాంత్ ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకు జరుగనున్న పోటీల్లో పాల్గొననున్నాడు.

ఘనంగా శ్రీరామలింగేశ్వర స్వామి జాతర

పాల్గొన్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు

శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ గర్భ గుడిలో ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రతాప్ రెడ్డి

తూప్రాన్, జనవరి 16 : మండలంలోని ఇస్లాంపూర్ శివారులో స్వయంభువుగా వెలిసిన రామ లింగేశ్వర స్వామి (రామప్పగుట్ట) ఆలయ జాతర సోమవారం ఘనంగా ప్రారంభమైంది. మొదటి రోజు ఎడ్ల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి హాజరై పూజలు చేశారు. రెండోరోజు మంగళవారం 'గోపాల కాల్వల' కార్యక్రమాన్ని చేపట్టారు. స్వామి వారి ఉత్సవ ప్రతిమను ఆలయం నుంచి గ్రామంలోని హనుమాన్ ఆలయం వరకు పల్లకీలో తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ చైర్మన్ సురేందర్ రెడ్డి, సర్పంచ్ సుకన్య రమేశ్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేశారు.

రామలింగేశ్వర స్వామి దర్శించుకునేందుకు తరలి వచ్చిన భక్తులు

ఓడీఎఫ్‌ను సందర్శించిన కేంద్రమంత్రి



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎవీఎన్ఎల్ సీఎండీ సంజయ్

కంది, జనవరి 16: సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారంలోని ఆయుధ కర్మాగారం (ఓడీఎఫ్)ను కేంద్ర రక్షణ, పర్యాటక శాఖ మంత్రి అజయ్‌భట్ సోమవారం సందర్శించారు. ఓడీఎఫ్‌లో తయారు చేస్తున్న యుద్ధ ట్యాంకర్లను పరిశీలించారు. అనంతరం బీఎంపీ సరత్ యుద్ధ ట్యాంక్‌లో ప్రయాణించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశ రక్షణలో ఓడీఎఫ్ కర్మాగారం చేస్తున్న పనితీరు గొప్పదన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన టెక్నాలజీతో యుద్ధ ట్యాంకులను తయారు చేస్తున్న సిబ్బందిని అభినందించారు. మరింత నూతన ఒరవడితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంతకుముందు ఏవీఎన్ఎల్ సీఎండీ సంజయ్‌తో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఓడీఎఫ్ సీజీఎం సుధాకర్, ఇతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అహ్మదీపూర్‌లో ముగిసిన క్రికెట్ టోర్నీ

గజ్వేల్ అర్బన్, జనవరి 16 : మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. టోర్నీలో కొల్గూర్ జట్టు ప్రథమ స్థానంలో నిలువగా, అహ్మదీపూర్ రెండోస్థానం, కిష్టాపూర్ మూడోస్థానంలో నిలిచాయి. విజేత జట్లకు నిర్వాహకులు అనంత రాములుచారి, నాగరాజులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఉపాధ్యాయ సంఘం నాయకులు మల్లికార్జున్, నాయకులు ఎల్లం, కనకరాజు, జనార్ధన్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్ అభినందించారు. కార్యక్రమంలో పాల రమేశ్‌గౌడ్, అహ్మద్, నిజామొద్దీన్, నరేశ్, రఫీ, నరేందర్‌రెడ్డి క్రీడాకారులు పాల్గొన్నారు.

గెలుపొందిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఆర్గనైజర్లు

హుస్నాబాద్ పట్టణంలో మార్నింగ్ వాక్ చేస్తున్న మంత్రి పొన్నం

సమస్యల పరిష్కారమే లక్ష్యం

రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, జనవరి 16: నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తానని రవాణా, బీసీ సంక్షేమశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని 4,5వ వార్డుల్లో సోమవారం స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన మార్నింగ్ వాక్ చేశారు. ప్రధాన వీధుల్లో తిరుగుతూ ప్రజలను పలకరిస్తూ, సమస్యలు తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లోని ప్రజలు మంత్రికి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు ఏ సమస్య ఉన్నా నేరుగా తనను కలిసి చెప్పుకోవచ్చన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుంటామన్నారు. ప్రజలందరూ సంక్రాంతి, కనుమ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలన్నారు. అనంతరం నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి అంబేద్కర్ చౌరస్తాలో టీ తాగారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు కేడం లింగమూర్తి, ఎండీ హసన్, వల్లపు రాజు, చిత్తారి రవీందర్, ముత్యాల సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో గాలి పటాలు ఎగురవేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్

సంబురంగా సంక్రాంతి

సంక్రాంతి పండుగను ఉమ్మడి మెదక్ జిల్లా వాసులు ఘనంగా జరుపుకున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన భోగి, మకర సంక్రాంతి, కనుమ వేడుకల్లో చిన్నా, పెద్దా ఉత్సాహంగా పాల్గొని సరదాగా గడిపారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఇంటి ఎదుట రంగురంగుల ముగ్గులు వేశారు. ఆవుపేడతో తయారు చేసిన గొబ్బెమ్మలు, పువ్వులు, నవధాన్యాలు పెట్టారు. వెజ్, నాన్‌వెజ్, పిండి వంటకాలు చేసుకొని కుటుంబసభ్యులు, బంధువులతో విందు చేసుకున్నారు. యువకులు గాలిపటాలు ఎగురవేయగా, చిన్నారులు బొమ్మరిల్లు ఆడి సందడి చేశారు. పలుచోట్ల ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

- ఉమ్మడి మెదక్ జిల్లా నెట్‌వర్క్, జనవరి 16

సిద్దిపేట టౌన్: గాలిపటాలను ఎగురవేస్తున్న యువత

చేగుంటలో మకర సంక్రాంతి సందర్భంగా ముగ్గులు వేస్తున్న యువతులు,చిన్నారులు

మెదక్‌లో ముగ్గు వేస్తున్న మహిళలు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కావలెను

★మన పట్టణంలో కొత్తగా స్థాపించిన బ్రాంచ్‌నందు పని చేయుటకు ఇంటర్, డిగ్రీ, బి.టెక్, PG చదివిన అభ్యర్థులు కావలెను. వర్క్ ఫ్రం హోం కలదు. సెల్: 9640248588, 9365043965.
NTW-323058

WANTED

★సిద్దిపేట్ హైవేలలో ప్రముఖ కార్ల షోరూంలయందు పనిచేయుటకు ''సెక్యూరిటీ గార్డులు'' కావలెను. పరిసర ప్రాంతాల వారికి ప్రాధాన్యత మంచి జీతం ఇవ్వబడును. స్వామి: 9392143108, 9652520827.
NT-313978

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.